కథ

హోతా పద్మినీదేవి

# అక్కరకు రాని చుట్టం

“బజారుకి వెళ్తున్నాను. ఇంట్లోకి ఏమైనా కావాలా?” బయటకి వెళ్ళబోతూ అలవాటు ప్రకారం అడిగాను. జవాబుగా నా శ్రీమతి రాధిక నా చేతిలో సరుకుల లిస్టు వ్రాసిన చీటీ పెట్టింది.

యధాలాపంగా కాదు కుతూహలంగా అది విప్పి చదవడం మొదలు పెట్టాను.

4 కె.జీ. పంచదార

1 కె.జీ. నెయ్యి

1/2 కె.జి. జీడిపప్పు, మైదా, నూనె పేకెట్లు చదవడం పూర్తి చెయ్యకుండానే ఆశ్చర్యం మిళితమైన చిరు ఆగ్రహంతో చూసాను.

నెలకి సరిపడే సరుకులు తెచ్చి పదిరోజులయినా కాలేదు. మళ్ళీ ఇవన్నీ ఏమిటి ?

“వండుకుంటుంటే సరుకులు నిండుకోవా ఏమిటి ? నిన్న హల్వా చేసానా? మొన్న కాజాలు అంతకు ముందు రోజు జాంగ్రీ”

“మనం వండుకుని తిన్నంత మాత్రాన సరుకులయిపోవు ఎదురింటి వాళ్లకి, పక్కింటి వాళ్ళకి వండి ఇస్తే అయిపోతాయి” పళ్ళ బిగువున కోపాన్ని దిగమింగి అన్నాను.

“నేను ఎదురింటి వాళ్ళకేమీ ఇవ్వను. పక్కింటి సుగుణకే ఇచ్చాను. తనకి హల్వా చెయ్యడం రాదుట ఎలా చెయ్యాలని అడిగితే చేసి ఇచ్చాను. ఇలాంటి హల్వా నేను పుట్టాక తినలేదు మీది అమృత హస్తమని ఒకటే పొగిడింది నన్ను” రాధిక స్వరంలో చిరు గర్వం.

“ఎందుకు పొగడదూ? నువ్వు తేరగా చేసి పెడుతుంటే తెగ తిని”

“పోనిద్దురూ పాపం! తనకి వంట రాదుట. వాళ్ళాయన మీ అమ్మ నీకు వంట నేర్పలేదా అని తెగ సాధిస్తాడుట”

“వంట చేతగాక కాదు. బద్ధకం. పగలంతా టి.వి. చూడ్డానికే టైమంతా సరిపోతుంది. ఇంక వంటెప్పుడు చేస్తుంది?” అక్కసుగా అన్నాను.

“పోనిద్దురూ. ఇరుగు పొరుగు అన్నాక ఇచ్చి పుచ్చుకోడం తప్పదు. తేలిగ్గా అంది రాధిక.

నేను పళ్ళు కొరుక్కుంటూ సంచీ తీసుకుని బజారుకి బయలుదేరాను.

ఒక నేషనలైజ్‌డ్ బ్యాంకులో కేషియర్‌గా పనిచేస్తున్నాను నేను. ఆస్తి పాస్తులేమీ లేవు. బడ్జెట్ ప్రకారం ఖర్చుపెట్టుకోవలసిన మధ్య తరగతి జీవిని.

నా అర్ధాంగి రాధిక కూడా పరిస్థితిని అర్ధం చేసుకుని జాగ్రత్తగా ఖర్చుపెట్టి వున్నంతలో పొదుపు చెయ్యగల మనిషే. నెలకో సినిమా. సినిమా నుంచి వస్తూ హోటల్‌లో టిఫిన్ తినడం ఆమె కోరే చిన్న కోరికలు. చీరలు నగలు కొనమని కూడా అడగదు. అన్ని విషయాలలోను స్ట్రిక్టుగా వుండే రాధికలో ఒక బలహీనత వుంది. తనని ఎవరైనా పొగడితే చాలు ఉబ్బి పోతుంది. తన శక్తికి మించి వాళ్ళకి ఉపకారం చేస్తుంది. ఆమెలోని బలహీనతని క్యాష్ చేసుకుంటోంది సుగుణ. రాధికలోని బలహీనతే నా ఇంటి బడ్జెట్‌ని అస్తవ్యస్తం చేస్తోంది. ప్రతీ నెల- నెలకి సరిపడే సరుకులు తెచ్చి పదిరోజులయినా గడవక ముందే మళ్ళీ సరుకులు తేవలసివస్తోంది. ఈ విషయంలో రాధికతో గొడవ పడదలచుకోలేదు. ఆమె తనంతట తనే తెలుసుకోవాలి. ఎలా?

ooo

ఆదివారం మధ్యాహ్నం అన్నం తినీ తినగానే నిద్ర ముంచుకొచ్చింది. ఒక గంట పడుకుని లేద్దామనుకున్న నాకు దాదాపు నాలుగవుతుండగా మెలకువ వచ్చింది. పొరపాటు... యాలకులు, పచ్చ కర్పూరము కలిసిన సువాసన వంటింట్లోంచి నా ముక్కు అదిరిపోయేలా చేసి చప్పున మెలకువ వచ్చింది.

‘రాధిక మళ్ళీ ఏదో పిండి వంట చేస్తోంది’ అనుకుంటూ లేచి బద్ధకంగా బయటకొచ్చాను. అప్పుడే ఏదో పని మీద బయటకొచ్చిన రాధిక నన్ను చూసి “లేచారా? ముఖం కడుక్కోండి. కాఫీ తెస్తాను” అంది.

నేను ముఖం కడుక్కుని నేరుగా వంట గదిలోకి వెళ్ళాను.

రాధిక బొబ్బట్లు చేస్తోంది.

“ఇవాళ బొబ్బట్లు చేస్తున్నావేమిటీ ?” అన్నాను ఆమె పిండి వంట చెయ్యడానికి పండుగో పుట్టిన రోజో రానవసరం లేదని తెలిసినా.

“సుగుణకి బొబ్బట్లు చెయ్యడం రాదుట. పోన్లే అని”

నేను నిటారుగా అయ్యాను. పీకల దాకా కోపం వచ్చినా తమాయించుకున్నాను.

రాధిక కాఫీ ఇచ్చింది. తాగుతూ అక్కడే నిలబడ్డాను. “ఆవిడగారికి బొబ్బట్లేనా, అసలే స్వీటూ చెయ్యడం రాదా?”

“పాయసం మాత్రం వచ్చుట. మొన్న కేరట్ హల్వా చేసాను కదా, ఆమెకి రుచి చూపిద్దామని పట్టుకెళ్ళానా? పాయసం నాకు పెట్టింది. ఫర్వాలేదు బాగానే వుంది”

“మరింకేం? మిగిలినవన్నీ నేర్చుకోవచ్చుగా”

“చెయ్యాలని మొదలుపెడుతుందిట పాపం! అస్సలు కుదరడం లేదుట. ఏదో తేడా. నేను చేసినట్టు కుదరడం లేదంటుంది” రాధిక స్వరంలో చిరుగర్వం.

“నువ్వు మాత్రం మీ అమ్మ కడుపులోనుంచి ఒక చేత్తో గరిట, మరో చేత్తో అట్ల కాడ పట్టుకుని పుట్టావా? వంట బ్రహ్మ విద్యేమీ కాదు. ఒకసారి పాడయినా అదే కుదురుతుంది. మీ సుగుణకి వంట వండడానికి బద్ధకం అని చెప్పు నమ్ముతాను” ఉక్రోషంగా అన్నాను పళ్ళెంలో మడత పెట్టి వున్న బొబ్బట్లకి ఎంత శెనగపప్పు పంచదార ఖర్చయివుంటాయో అంచనా కడుతూ.

“పోనిద్దురూ! ఇరుగు పొరుగు అన్నాక..” రాధిక సేమ్ డైలాగ్ కొట్టింది.

బీరకాయ కూరనుంచి బిరియానీ వరకు సుగుణకి ఇస్తూనే వుంది రాధిక. గతంలో పండక్కి పిల్లల పుట్టిన రోజుకి తప్ప స్వీట్లు చేసేది కాదు. ఇప్పుడు ప్రతీ రాత్రి వసంత రాత్రే అన్నట్టు ఇంచుమించు ప్రతి రోజు పండుగే. నా పర్సు బరువు తగ్గి శరీరం బరువు పెరగటం మొదలుపెట్టింది. నడము చుట్టు కొలత పెరిగిందని టైటవుతున్న ప్యాంట్లు చెబుతున్నాయి.

ఆ రోజు ఒక గంట ముందే బ్యాంకుకి బయలుదేరుతున్న నన్ను ఆశ్చర్యంగా అడిగింది మా ఆవిడ.

“అదేమిటి, అప్పుడే బయలుదేరారు?”

“ఇవ్వాళ్టి నుంచి బ్యాంకుకి నడిచి వెళ్తాను”

“అదేం?”

“రోజూ నువ్వు చేసి పెట్టిన స్వీట్లు తిని ఎంత లావయిపోయానో చూడు. నడకని మించిన వ్యాయామం లేదు. నడిచి వెళ్తే స్కూటర్ పెట్రోలు కూడా ఆదా చెయ్యవచ్చు”

‘ఆదా’ అనే మాట నా నోట వినగానే రాధిక కళ్ళలో నీళ్ళూరాయి.


“నేను దుబారా ఖర్చులు చేస్తున్నాను కదూ?” అంది అపరాధిలా తలవంచుకుని.

“ఛ! ఎవరన్నారలా?”

“ఎవరో చెప్పాలా? నాకు తెలియదా? ఇంక రేపటి నుంచి సుగుణకేమి వండి ఇవ్వను” అంది.

మా ఆవిడలోని మార్పు నన్ను సంతోషపెట్టింది. కానీ ఆ సాయంకాలం బ్యాంకు నుంచి ఇంటికొచ్చేప్పటికి ఆ ఆనందం కాస్తా ఆవిరయిపోయింది. వంటింట్లోంచి ఘుమఘుమలు. చేతిలో గిన్నెతో నా ముందు నుంచి వెళ్తూ నన్ను చూసి పలుకరింపుగా నవ్విన సుగుణని చూసి బిత్తరపోయాను.

నేను నిశ్చేష్టుడిని, నిస్తేజుడిని అయిపోవడానికి కారణం మా ఆవిడ మాట తప్పడం కాదు సుగుణ భారీకాయాన్ని చూసి. ఈ నాలుగు నెలలుగా మా ఆవిడ చేసిన వంటలు పిండి వంటలు తిన్న సుగుణ సుమో యోధురాలిలా తయారయింది. భారీ కాయంతో భారంగా నడుస్తూ



వెళ్తున్న ఆమెని చూసి కసిగా పళ్ళు నూరుకున్నాను. 'ఆమెకి త్వరలో ఏ డయాబిటీసో వస్తే బాగుండును. అదొక్కటే కాదు బి.పి., అల్సర్ వగైరా జబ్బులన్నీ వచ్చి ఏమీ తినడానికి వీల్లేకుండా తినడానికి భయపడే జబ్బులొస్తే బాగుండును' కసితీరా శపిస్తున్న నాలో సంస్కారం మేల్కొంది.

మా ఆవిడలాంటి మొహమాటస్తులు పొగడ్తలకి ఉబ్బిపోయే వాళ్ళు వున్నంతకాలం సుగుణ లాంటి వాళ్ళు దాన్ని క్యాష్ చేసుకుంటూనే వుంటారు. జరుగుతున్న దాంట్లో సుగుణ తప్పేం వుంది? రాధిక పొగడ్త అనే అగడ్తలో పడిపోయింది. ఆమెని బయటకి లాగడం ఎలా?

ooo

మరునాడు మా అబ్బాయి ఎమ్సెట్ ఎగ్జామ్ రాయవలసి వుంది. బేంక్‌లో సీరియస్‌గా పని చేసుకుంటున్న నా సెల్‌కి మా బావమరిది ఫోన్ చేసాడు. మా మామగారికి గుండెనెప్పి వచ్చిందని హాస్పిటల్‌లో ఐ.సి.యు.లో వున్నారని చెప్పాడు. నేను అతనితో మాట్లాడి ఫోన్ పెట్టాక, రాధిక ఏడుస్తూ ఫోన్ చేసింది. డెబ్బై ఏళ్ళు పైబడిన తండ్రి ఎలా వుంటాడోననే ఆందోళన ఆమె స్వరంలో.

"గోదావరిలో బయలుదేరుదాం" అన్నాను ఆమెని వూరడిస్తూ.

"రేపు బుజ్జిగాడి ఎమ్సెట్ ఎగ్జామ్?" అంత దుఃఖంలోను వాడి పరీక్ష సంగతి మరిచిపోలేదామె.

"ఎలా? సరే నేను ఇంటికొస్తున్నాను. ఆలోచిద్దాం. కంగారు పడకు" అని మేనేజరు దగ్గర పర్మిషన్ తీసుకుని ఇంటికొచ్చాను.

పావుగంటసేపు బుజ్జిగాడిని ఎక్కడ వుంచాలా అని ఇద్దరం బుర్రలు బద్దలు కొట్టుకున్నాం. ఆఖరికి మా ఇద్దరికీ తట్టిన ఆలోచన ఒకటే.

"సుగుణని అడిగితే?"

"నేనడిగితే తను కాదనదు" అంది రాధిక. అన్నదే తడవు సుగుణ దగ్గరికి వెళ్ళింది.

అయిదు నిముషాలు గడవకముందే ఎర్రబడిన ముఖంతో వచ్చింది. ఏమయిందని అడగక ముందే చెప్పింది.

"బుజ్జిగాడిని వాళ్ళింట్లో పెట్టుకోరుట. వాళ్ళబ్బాయి కూడా ఎమ్సెట్ ఎగ్జామ్ రాయాలి కదా? డిస్టర్బ్ అవుతాడుట. మనుషుల మధ్య సంబంధ బాంధవ్యాలు ఇచ్చిపుచ్చుకోడం ద్వారా పటిష్టమవుతాయంటారు. కానీ పుచ్చుకోవడమే కాని ఇవ్వడం తెలియని మనిషిని మొదటిసారి చూస్తున్నాను. కనీసం మొహమాట పడకుండా 'నో' అని ఎలా చెప్పగలిగిందో?" రాధిక స్వరంలో నిస్సహాయమైన కోపం.

"ఆవిడ అక్కరకు రాని చుట్టంలాంటిదని ఇప్పటికైనా అర్థమయిందా?" అన్నాను.

"ఇప్పుడెలాగండీ? నాన్నగారెలా వుంటారో? మనం ఊరికెలా వెళ్తాం?" అంది ఏడుస్తూ.

"నువ్వు ఇవాళ చిన్నవాడిని తీసుకుని వెళ్ళు. రేపు బుజ్జిగాడి పరీక్ష అయ్యాక నేనూ వాడూ వస్తాం"

"ఎలా? మీ భోజనం... మీకు వంట రాదుగా?"

"ఏదో తంటాలు పడతాం. ముందు నువ్వు బయలుదేరు"

రాధికని ట్రయినెక్కించి వచ్చాను. బుజ్జిగాడు పుస్తకాలతో కుస్తీ పడుతున్నాడు.

నేను అన్నం కుక్కర్‌లో వండి కూర హోటల్ నుంచి తెచ్చాను. ఆ మరునాడు కూడా అంతే. సుగుణ కనీసం ఒక్కసారయినా ఏం చేస్తున్నారని పలుకరించలేదు. నాకు ఆమె మీద కోపం రాలేదు. రాధిక మీద కూడా కోపం రాలేదు. దీన్ని గుణపాఠంగా తీసుకునైనా రాధిక మారుతుందో లేదో.

ooo

మా మామగారికి కులాసాగా వుంది. ప్రాణాపాయం తప్పింది. ఆయన్ని హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేసాక నేను వైజాగ్‌కి వచ్చేస్తాను.

రాధిక పిల్లలని తీసుకుని వచ్చేటప్పటికి మరో పది రోజులు పట్టింది. అన్ని రోజులూ హోటల్ తిండే గతయింది నాకు.

ఊరు నుంచి వచ్చిన రాధికని పలుకరించడానికి వచ్చినట్టుంది సుగుణ. వంట గదిలో నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

"మీ నాన్నగారెలా వున్నారు?"

"కులాసాగానే వున్నారు"

"ఏం చట్నీ అది?"

"చింతకాయ పచ్చడి" రాధిక స్వరంలో తొక్కిపట్టిన అసహనం.

"ఎలా చేస్తారు?"

"చింతకాయలని రోట్లో వేసి మెత్తగా తొక్కి గింజలన్నీ ఏరి ఆపై పోపు వేసి రుబ్బాలి"

"మీరు వంట చాలా బాగా చేస్తారు రాధికా! మీ చేత్తో ఏం వండినా అమృతంలా వుంటుంది" సుగుణ పొగుడుతోంది.

"వంట బ్రహ్మ విద్యేమీ కాదు. శ్రద్ధగా వండితే మీరూ బాగా చెయ్యగలరు" అంది రాధిక తను చేసిన పచ్చడి రుచి చూపించబోనని స్పష్టం చేస్తూ.

కొన్ని క్షణాల తర్వాత గడప దాటుతున్న సుగుణని చూసాను. ఆమె చేతులు ఖాళీగా వున్నాయి. ఇంక రాధిక-సుగుణే కాదు సాక్షాత్తూ ఆ బ్రహ్మ దేవుడొచ్చి పొగిడినా అగడ్తలో పడదు.

నాకు తృప్తిగా వుంది.